క్లుప్తంగా

రేగిడి సమీపంలో ఏనుగుల గుంపు



రేగిడి సమీపంలో తివ్వాకొండల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో రేగిడి సమీపంలో మంగళవారం ఏనుగుల గుంపు చేరి గిరిజనులకు ఆందోళన కలిగిస్తున్నాయి. కురుపాం మండలం తులసి నుంచి రేగిడి సమీపంలోకి నాలుగు ఏనుగుల గుంపు తరలి వచ్చినట్లు గిరిజనులు వాపోతున్నారు. తాము పండించే పంటలు తినివేస్తున్నాయని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయుర్వేదంతో మెరుగైన ఆరోగ్యం



ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ రామయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రాచీన కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆయుర్వేద వైద్యంతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. రామయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాల వద్ద బోటనీ అధ్యాపకుడు సత్యారావు ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యాన్ని ప్రవేశపెట్టిన ధన్వంతరి జయంతి రోజున ప్రతి ఏడాదీ జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం బాగా పనికొస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ స్వరూప, హిస్టరీ అధ్యాపకులు శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారాలు తగవు

● వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి



గరుగుబిల్లి: మండలంలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అయిపోయిందంటూ కూటమి నాయకులు చేస్తున్న ప్రచారం నిజం కాదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి నాయకులు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన అప్పటి పార్టీ మండల కన్వీనర్ ఉరిటి రామారావును అధిష్ఠానం సస్పెండ్ చేసిందన్నారు. అలాగే ఒక ఎంపీటీసీ సభ్యుడు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాడని చెప్పారు. మిగిలిన ఎంపీటీసీ సభ్యులందరూ వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని, నేటికీ పార్టీ బలంగానే ఉందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయిన రామారావు టీడీపీలో చేరాలనుకుంటున్నా, ఓ వర్గం వ్యతిరేకిస్తోందన్నారు. అలాగే దళాయివలస సర్పంచ్ శ్రీనివాసరావు కూడా టీడీపీలో చేరినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి నాయకత్వంపై నమ్మకంతో ఉన్నారని చెప్పారు.

రోడ్డు ఇలా..
నడిచేదెలా..!



కోతకు గురైన వాడబాయి రహదారి



ఇంటికి సరుకులు మోసుకువస్తున్న దేరుగండ గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ వాడబాయి గ్రామానికి వెళ్లే రహదారి వర్షాలకు బాగా కొట్టుకుపోయింది. రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలెలా సాగించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లప్పటి నుంచి వాడబాయికి రహదారి ఏర్పాటు చేస్తామంటూ కూటమి నాయకులు గతేడాది నవంబర్‌లో హామీలు గుప్పించారు. కాని ఇంతవరకు ఒక్క పని కూడా మొదలు పెట్టలేదు. వర్షాలు పడకపోతే ఉన్న రాళ్ల రహదారిపై ఎలాగోలా వచ్చేవారమని.. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి సైతం కొట్టుకుపోవడంతో అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని మోతలు..

మండలంలోని ఎగువ తాడికొండ నుంచి దేరుగండ గ్రామానికి కూడా నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామానికి చెందిన గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ఇంటికి కావాల్సిన నిత్యావసరాలు, ఇతర వస్తువులను కర్రలకు కట్టుకుని తీసుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం



వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ కమలాకర్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు డిజిటల్ గ్రీన్ రాష్ట్ర కోర్డినేటర్ వి.కమలాకర్ అన్నారు. మండలంలోని తోటపల్లిలోని జట్టు ట్రస్టు కార్యాలయంలో జరుగుతున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శిక్షణలో నేర్చుకొన్న అంశాలను ఎఫ్‌పీఓలు రైతులకు వివరించాలన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో గుర్తింపు ఉందని చెప్పారు. రైతులు పండించిన పంటల వివరాలను ఫార్మర్. చాట్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, శిక్షకులు గిరిబాబు, సూకంనాయుడు, జి.మురళి, మోహన్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిబజార్‌లో సరుకుల విక్రయం



వాహనంలో నిత్యావర సరుకులు విక్రయిస్తున్న దృశ్యం

సీతంపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వెలుగు శాఖ ఆధ్వర్యంలో గిరిబజార్ వాహనంలో నిత్యావసర సరుకులను మంగళవారం విక్రయించారు. దీనిలో భాగంగా మలేరియా నివారణా శాఖ, వైద్యశాఖ సిబ్బంది గిరిజనులకు ఆరోగ్యంపై డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులు వివరించారు. తాడిపాయి, కిల్లాడ, దోనుబాయి, దారపాడు, గుమ్మడలలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం కమలకుమారి, డీఎంఓ పీవీ సత్యనారాయణ, వైద్యాధికారి భానుప్రతాప్, సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు, ఏఎంఓ శ్రీనివాసరావు, ఎంటీఎస్ ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

సేవలు మెరుగుపడాలి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



నగర పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది పనితీరు మెరుగుపడాలని.. అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్రమణలు జరిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతోపాటు సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఉన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంభించాలి

● డీపీఎం శ్రావణ్‌కుమార్



డ్రోన్ సహాయంతో జిల్లేడు ద్రావణం పిచికారీ

జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చింతలబెలగాంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎం. సత్యనారాయణ, పెద్దింటి కృష్ణ, జామి శంకరరావు, కూర్మినాయుడులకు చెందిన ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ ద్వారా జిల్లేడం ద్రావణం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా డీపీఎం శ్రావణ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనం లభిస్తుందని చెప్పారు. డ్రోన్ ద్వారా జిల్లేడు ద్రావణం పిచికారీ చేయడానికి కేవలం నాలుగు వందల రూపాయలు మాత్రమే ఖర్చవుతుందన్నారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు, సిలబస్ డవలెప్‌మెంట్ కన్సల్టెంట్ డాక్టర్. డి.పారినాయుడు, రీజనల్ తీమోటిక్ కె.ప్రకాష్, రీజనల్ టెక్నికల్ అధికారి జి. హేమసుందర్, శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్, బి. ధనుంజయ, ఎం. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టుల సౌకర్యార్థం హోమ్ స్టేలు..

● కలెక్టర్ ప్రభాకరరెడ్డి



ఆడలి వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఉన్న పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే టూరిస్టుల సౌకర్యార్థం 50 పీవీటీజీ హోమ్ స్టేలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. మండలంలోని ఆడలి వ్యూ పాయింట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సమావేశ మందిరంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులు విడిది చేయడానికి ఇక్కడ ఎటువంటి సదుపాయాలు లేవన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు జలపాతాలు, వ్యూ పాయింట్స్ సమీపంలో కాటేజీలు నిర్మించాలని ఆదేశించారు. ఇందుకు స్థానిక యువతను భాగస్వాములను చేసి రుణాలు మంజూరు చేయాలన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో శిక్షణ ఇప్పించాలని తెలిపారు. ప్రకృతిసిద్ధంగా ఉన్న ఆడలి వ్యూ పాయింట్‌ను ఎకో టూరిజంగా తీర్చిదిద్దాలన్నారు.

డోలీ గ్రామాలకు తొలి ప్రాధాన్యం..

ఐటీడీఏ ద్వారా చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో డోలీ మోతలు ఉన్న గ్రామాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి పాసైన గిరిజన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏపీఓ చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, జిల్లా పర్యాటక మేనేజర్ నారాయణరావు, డీఈ నాగభూషణరావు, పీహెచ్‌ఓ ఎస్‌వీ గణేష్, జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ తప్పనిసరి



గొట్టివలసలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జ్యోత్స్న

గరుగుబిల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వరి పంటలో సస్యరక్షణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న తెలిపారు. మండలంలోని గొట్టివలసలో మంగళవారం పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాముపొడ, అగ్గి, ఆకుముడత తెగుళ్లను గమనించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. తెగుళ్ల నివారణకు లీటర్ నీటిలో 0.6 గ్రాముల ట్రై సైక్లోజోల్ మందు కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

మహిళా భక్తుల ఊరేగింపు..



భామిని మండలం బత్తిలిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళా భక్తులు లక్ష దీపార్చన పూజా సామగ్రితో మంగళవారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కోటదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– భామిని

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కురుపాం: ఇంతవరకు రాష్ట్రంలో అమలులో ఉన్న ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలకు మార్చుతూ ఇటీవల అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, గిరిజన సంఘ జిల్లా నాయకుడు కె. సీతారాం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే పని గంటలను పెంచారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మిక, ఉద్యోగ వర్గాలు పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపును ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన తప్పదన్నారు. నిరసనలో నాయకులు సింహాచలం, చంటి, గౌరి, వినోద్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లిపోయారు. ఆలయ అభివృద్ధికి వినియోగించాలనే ఉద్దేశంతో ఐదేళ్లుగా హుండీ తెరవలేదు. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం యథావిధిగా ఆలయాన్ని తెరిచిన పూజారులు హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని కమిటీ సభ్యులకు అర్చకుడు మల్లేశ్వరరావు తెలియజేశారు. దీంతో కమిటీ సభ్యులు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై ఫకృద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఇదిలా ఉండగా.. పెద్దూరులోని శివాలయంలో హుండీని దొంగిలించేందు దొంగలు ప్రయత్నించినప్పటికీ వీలుకాకపోవడంతో చిందరవందర చేసి వెనుదిరిగారు. ఆరేళ్ల కిందట కూడా పెద్దూరు ఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనం జరిగిందని..మళ్లీ ఇన్నాళ్లకు దొంగలు పడ్డారని గ్రామస్తులు తెలిపారు.

గండి పూడ్చివేత



ఇసుక బస్తాలతో పూడ్చుతున్న గండి

జియ్యమ్మవలస: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయింది. దీంతో వరద నీరు పంట పొలాల్లో చేరడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. దీంతో చినమేరంగి నీటి సంఘ అధ్యక్షుడు, వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్ వెంటనే స్పందించి రైతుల సహకారంతో కొట్టుకుపోయిన రిటైనింగ్ వాల్ స్థానంలో ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. రిటైనింగ్ వాల్ విషయాన్ని రావాడ వట్టిగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎం. సత్యంనాయుడు, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రసాద్ తెలిపారు.

గిరిజన యువకుడ్ని వరించిన ఉద్యోగాలు



మురళి

సీతంపేట: నిరుపేద గిరిజన యువకుడికి ఒకేసారి రెండు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. మండలంలోని కొండాడ పంచాయతీ పరధిలోని లోవగూడకు చెందిన సవర మురళికి సెంట్రల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ (టెక్నికల్ ఆఫీసర్) ఉద్యోగాలు ఒకేసారి వచ్చాయి. టెన్త్ వరకు మల్లి గిరిజన గురుకుల పాఠశాలలో చదివిని మురళి ఇంటర్మీడియట్‌ను మల్లి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పూర్తి చేశారు. నైర వ్యవసాయ కళాశాలలో బీఎస్‌సీ చదివి..ప్రస్తుతం భువనేశ్వర్‌లో ఎంఎస్సీ చదువుతున్నాడు. ఈక్రమంలో ఒకేసారి రెండు ఉద్యోగాలు రావడంతో పలువురు ఆయన్ను అభినందించారు. మురళి తల్లిదండ్రులు లక్కమ్మ, వెంకటరావు కూలి పనులు చేసుకుంటూ కుమారుడ్ని చదివించారు. అలాగే ప్రముఖ సామాజిక కార్యకర్త ఎస్పీ పెంటయ్య మాస్టారు మురళికి సహాయ సహకారాలు అందించారు.

ఎమ్మెల్సీ సహకారంతో అన్నదానం



అమ్మవారికి భోగం తీసుకువెళ్తున్న శ్రీగణేష్ మణికంఠ కార్తికేయ, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: దసరా ఉత్సవాల్లో భాగంగా కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సహకారంతో మంగళవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. విక్రాంత్ కుమారుడు పాలవలస శ్రీగణేష్ మణికంఠ కార్తికేయ అమ్మవారికి భోగం సమర్పించి అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మథరావు, పాలవలస ధవలేశ్వరరావు, పాపినాయుడు, రమణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి తీరు సరికాదు..

కొమరాడ: మండలంలోని కెమిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి తీరు వల్ల గిరిజన విద్య కుంటుపడుతోందని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ..ప్రధానోపాధ్యాయుడు బాధ్యతారాహిత్యంగా పని చేస్తున్నారన్నారు. గతంలో అప్పటి ఐటీడీఏ పీఓ ఆశుతోష్ శ్రీవాస్తవ్ పరిశీలన సమయంలో ప్రధానోపాధ్యాయుడి బాధ్యతారాహిత్యం బయట పడిందన్నారు. అప్పట్లో షోకాజ్ నోటీసులు ఇచ్చినా, ఆయనలో మార్పు రాలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆది కర్మయోగిపై పీఓ సమీక్ష



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ఆది కర్మయోగి అభియాన్ కింద సిద్ధం చేసిన విజన్ ప్లాన్ ను ఎంపీడీఓలు పునఃపరిశీలించి ఐటీడీఏకు సమర్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆది కర్మయోగి అభియాన్ పై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మాస్టర్ ట్రైనీలు, బ్లాక్ మాస్టర్ ట్రైనీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం, జీఎల్ పురం, జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, పాలకొండ, భామిని, వీరఘట్టం తదితర 12 మండలాల్లోని 165 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలు కానుందని తెలిపారు. ఈ 165 గ్రామాల్లో గల 949 హేబిటేషన్లను కవర్ చేస్తూ గ్రామ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇదివరకే ఆదేశించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 6 నుంచి ఇప్పటి వరకు నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ప్రతి హ్యాబిటేషన్‌ను కవర్ చేస్తూ గ్రామసభలు నిర్వహించిన సంగతిని గుర్తుచేశారు. 5 గ్రామాలు మినహా మిగిలిన 160 గ్రామాల్లో గ్రామ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం అయిందని, బుధవారం వరకు సమయం ఉన్నందున ఆ గ్రామాలకు చెందిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల్లో గుర్తించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రాధాన్యతా అంశాలను తమ దృష్టికి తీసుకు రావాలని, రానున్న మూడురోజుల్లో వాటి వివరాలను సిద్ధం చేయాలని చెప్పారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన గ్రామ కార్యాచరణ ప్రణాళికను సమర్పించడంతో పాటు ఆది కర్మయోగి వెబ్ సైట్‌లో నమోదు చేయడం పట్ల అవగాహన ఉండాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మాస్టర్ ట్రైనీలు, బ్లాక్ మాస్టర్ ట్రైనీలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: గాయత్రీదేవి అలంకరణలో కోటదుర్గమ్మ



పాలకొండ: కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



గరుగుబిల్లి: అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



వీరఘట్టం: దుర్గగుడిలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు

కరుణించి.. కాపాడమ్మా..

శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. ఆయా మంటపాల్లో కొలువైన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వీరఘట్టం కోటదుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో మంగళవారం దర్శించుకున్నారు. భవానీ భక్తులు సాయంత్రం శరణుఘోషతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కలెక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లి, నాగూరు, దళాయివలస, పెద్దూరు, రావుపల్లి, రావివలస, తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన మంటపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

– వీరఘట్టం/పాలకొండ/గరుగుబిల్లి